సాక్షి
రంగారెడ్డి

గురువారం । 21 । నవంబర్ । 2024



పోరును ఆపలేరు

అక్రమ కేసులు, నిర్బంధాలతో తమ పోరాటాన్ని ఆపలేరని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. 8లో▸



ముగిసిన మైసిగండి జాతర

కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. 8లో▸



రిజర్వేషన్లు పెంచాలి

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నరేశ్ ప్రజాపతి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు బీసీ కమిషన్ బృందం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనలో భాగంగా ఆయా రాజకీయ పార్టీలు, కుల సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం గురువారం జిల్లాకు రానుంది. రంగారెడ్డి సహా మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు సంబంధించిన రాజకీయ పార్టీలు, కుల సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరించనుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ అభిప్రాయసేకరణ కార్యక్రమానికి చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ హాజరుకానున్నారు.

సర్వేకు వివరాలిచ్చిన కలెక్టర్



సమగ్ర కుటుంబ సర్వే వివరాలు అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బంజారాహిల్స్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ కుల గణన సర్వేలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తన వివరాలు అందజేశారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–13లోని కలెక్టర్ బంగ్లాలో సూపర్‌వైజర్ అధికారి భావ్‌సింగ్, ఎన్యుమరేటర్ శాంతిలక్ష్మీ సర్వేలో భాగంగా నారాయణరెడ్డి వివరాలు నమోదు చేసుకున్నారు.

'ట్రీ–ఫ్రైడ్'కు బ్రేక్

- డిసెంబర్ 1 నుంచి సబ్సిడీలు నిలిపివేత
- జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీ–ఫ్రైడ్ పథకం నిలిపివేస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో టాక్సీలు, మోటార్ క్యాబ్‌లు కొనుగోలు చేసే వారికి సబ్సిడీలు అందవని చెప్పారు. టీ–ఫ్రైడ్ పథకంలో ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ లబ్ధిదారులకు టాక్సీ, మోటారు క్యాబ్ కొరకు అందిస్తున్న రాయితీ (సబ్సిడీ) ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డిసెంబర్ 1 నుంచి అమలవుతాయని చెప్పారు. నవంబర్ 30 వరకు కొన్న వాహనములకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రశాంతంగా ఫ్యూచర్ సిటీ రహదారి సర్వే



రాచులూరు రెవెన్యూలో సర్వే చేస్తున్న అధికారులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీలోకి నేరుగా చేరుకునేలా నిర్మించనున్న రహదారికి అవసరమైన భూసేకరణకు రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే పనులు పోలీస్ బందోబస్తు నడుమ కొనసాగాయి. బుధవారం రాచులూరు రెవెన్యూ పరిధిలోని భూములను రెండో రోజు సర్వే నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు సీతారామ్, వెంకట్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ సిబ్బంది సర్వేను కొనసాగించారు. ఎవరూ పనులను అడ్డుకోకుండా రైతులతో మాట్లాడి సర్వే సాఫీగా జరిగేలా చూశారు.

'మాలల సింహగర్జన'ను జయప్రదం చేయండి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల

షాద్‌నగర్: మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల కోరారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాల మాట్లాడుతూ.. మాలలంతా ఏకమై మరో ఉద్యమం చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ హక్కులను పాలకులు కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవద్దని పిలుపునిచ్చారు. హక్కుల పరిరక్షణకు మాలలంతా ఉద్యమించాలన్నారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు మాలల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



నిధుల ఖర్చుపై నిర్లక్ష్యం

ఎంపీ లాడ్స్‌తో పనులు చేయించడంలో లోక్‌సభ సభ్యులు విఫలం

- ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితం
- 2019–2023లో చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్‌లో 289 పనులకు 17.35 కోట్ల నిధులు మంజూరు
- రూ.5.64 కోట్ల ఖర్చుతో 108 పనులు మాత్రమే పూర్తి
- 18వ లోక్‌సభ సభ్యులకు రూ.5కోట్లు మంజూరు
- నేటికీ పైసా ఖర్చు చేయని ఎంపీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పార్లమెంటు సభ్యుల నిధుల (ఎంపీ లాడ్స్) ఖర్చు విషయంలో మన ఎంపీలు కొంత వెనుకబడ్డారు. పనులకు ప్రతి పాదనలు, శంకుస్థాపనలపై చూపిన శ్రద్ధ.. వాటిని పూర్తి చేయడంలో చూపడం లేదు. ఫలితంగా 17వ లోక్‌సభ కాలంలో మంజూరైన పనులు.. ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఎంపీ లాడ్స్ కింద ఒక్కో సభ్యుడికి కేంద్రం ఏటా రూ.ఐదు కోట్ల నిధులు కేటాయిస్తున్న విషయం విదితమే.

చేవెళ్లలో ఖర్చు చేసింది 32 శాతమే

2019–2023 వరకు చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్‌కు కేంద్రం రూ.17.35 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి జిల్లాలో రూ.15.67 కోట్ల అంచనా వ్యయంతో 289 పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన పదవీ కాలం పూర్తయింది కానీ.. ఇప్పటికీ 181 పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. కేవలం రూ.5.64 కోట్ల విలువ చేసే 108 పనులు(32 శాతం) మాత్రమే పూర్తవడం గమనార్హం. ప్రస్తుత 18వ లోక్‌సభ సభ్యుడికి రూ.5 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు ఒక్క పనికి శంకుస్థాపన కాలేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో చేపట్టిన పనులు

సంవత్సరం	అంచనా (రూ.కోట్లలో)	చేపట్టిన పనులు	పూర్తయినవి
2019–20	రూ.4.75	90	79
2020–21	–	–	–
2021–22	రూ.1.96	23	9
2022–23	రూ.4.86	93	8
2023–24	రూ.4.89	92	12

జిల్లాతో సంబంధం ఉన్న లోక్‌సభ స్థానాల్లో ఇలా

- మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యుడు ఎనుముల రేవంత్‌రెడ్డి రూ.కోటితో 23 పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 15 మాత్రమే పూర్తయ్యాయి.
- భువనగిరి లోక్‌సభ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.97.99లక్షలతో 75 పనులకు శంకుస్థాపన చేయగా, వీటిలో 36 మాత్రమే పూర్తి చేశారు.
- నాగర్‌కర్నూల్ లోక్‌సభసభ్యుడు పోతుగంటి రాములు రూ.1.56 కోట్ల అంచనా వ్యయంతో 40 పనులు ప్రారంభించగా, వీటిలో 29 పనులే పూర్తి చేశారు.
- మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి రూ.1.39 కోట్ల అంచనాతో 33 పనులకు శంకుస్థాపన చేయగా, వీటిలో 11 మాత్రమే పూర్తయ్యాయి.

నేటి నుంచి లోక్‌మంథన్

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా నిర్వహిస్తున్న లోక్‌మంథన్ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రారంభించనున్నారు. ఈ నెల 24 వరకు లోక్ మంథన్– 24 భాగ్యనగర్ పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నారు. 21న ప్రారంభోత్సవాల్లో భాగంగా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 100కు పైగా కళలు, 1,500 మంది కళాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



సర్దార్‌నగర్‌లో పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న ఒడిస్సా ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం

ఆన్‌లైన్ సేవలు అదుర్స్

సర్దార్‌నగర్ పంచాయతీ పాలనపై ఒడిశా బృందం ప్రశంసలు

షాబాద్: గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి బాగుందని ఒడిశా బృందం సభ్యులు కితాబిచ్చారు. బుధవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని ఒడిశా ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం సభ్యులు సందర్శించారు. గ్రామంలో పర్యటించిన ఒడిశా బృందం సభ్యులు పంచాయతీ కొనసాగుతున్న తీరును పరిశీలించారు. సొంత నిధుల సేకరణ, రాష్ట్ర నిధుల నిర్వహణ, ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పల్లె ప్రకృతివనం, కంపోస్ట్ యార్డు, వైకుంఠధామం, హరితహారం నర్సరీ తదితరాలను పరిశీలించారు. పంచాయతీల పరిపాలనకు నిధుల సేకరణ, ఆన్‌లైన్ సేవలు చాలా బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఒడిశా అధికారుల బృందం సీఈఓ అనిల్ కుమార్, జిల్లా శిక్షణ అధికారి రుద్రయ్య, శ్రీనివాస్, షాబాద్ ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, పంచాయతీ కార్యదర్శులు కవిత, శంకర్, రమేశ్, సిబ్బంది తదితరులున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి



డాక్టర్ సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న గురునానక్ వర్సిటీ వైస్ చైర్మన్ గగన్ దీప్‌సింగ్

- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి
- గురునానక్ వర్సిటీలో డిఫెన్స్, స్పేస్ కన్వెన్షన్–2024 సదస్సు
- పాల్గొన్న శాస్త్రవేత్తలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల్లో అభిరుచిని పెంచేందుకు డిఫెన్స్, స్పేస్ కన్వెన్షన్–2024 సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, భారత రక్షణ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. బుధవారం గురునానక్ విశ్వవిద్యాలయంలో భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ప్రపంచంలోని డిఫెన్స్, స్పేస్ రంగాల్లో నిపుణులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. యువతలో దేశభక్తి, నైపుణ్యం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి పలు ముఖ్యమైన విషయాలపై చర్చించారు. శాస్త్ర, సాంకేతిక, టెక్నాలజీ, ఇంజినీరింగ్ మరియు మేనేజ్‌మెంట్ వంటి విభాగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదగడానికి కావాల్సిన సామర్థ్యాలు, విద్యావకాశాలపై వివరించారు. అనంతరం డాక్టర్ సతీష్‌రెడ్డి యువతకు సాంకేతిక పరిజ్ఞానం పరిశోధనలు వాటి అవసరాలు, అలవర్చుకునే విధానాలను వివరించారు. డాక్టర్ అబ్దుల్ కలాం జీవిత గాథలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజాసింగ్ తంగదురై, డీఆర్‌డీఎల్ డాక్టర్ అశోక్ కుమార్ పాండే, హెచ్‌ఓడీ ఏరోస్పేస్ ఇంజినిరింగ్ ఐఐటీ హైదరాబాద్ కె.శ్రీనివాస్ రాజు, గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్, చాన్సలర్ సర్దార్ గగన్ దీప్‌సింగ్, విద్యాసంస్థల ఎండీ, వీసీ డాక్టర్ హెచ్ ఎస్ సైనీ, డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ సంజీవ శ్రీ వాస్తవ, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.పార్థసారథి, ప్రిన్సిపాల్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతతరం సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలను విద్యాసంస్థల వైస్ చైర్మన్, చాన్సలర్ గగన్ దీప్‌సింగ్ ఘనంగా సత్కరించారు.

మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా వైద్య విధాన పరిషత్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్

చేవెళ్ల: ఆస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం మన బాధ్యత అని జిల్లా వైద్య విధాన పరిషత్ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సౌకర్యాలను, వార్డులను, రోగులకు అందించే వైద్యం తీరును పరిశీలించారు. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేలా పనిచేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది తప్పక సమయ పాలన పాటించాలన్నారు. గర్భిణులకు ఆస్పత్రిలోనే అని వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఆస్పత్రిలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రంలోని రోగులతో మాట్లాడారు. ఆయన వెంట ఏరియా ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ఇన్‌చార్జి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్

క్రషర్ల పరిశీలన

కందుకూరు: మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ ఫ్యూచర్ సిటీ సమీపంలో కొనసాగుతున్న స్టోన్ క్రషర్లను బుధవారం మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ సందర్శించారు. అక్కడ చేపట్టిన తవ్వకాలను, క్రషర్ పనులను పర్యవేక్షించారు. ఎంత విస్తీర్ణంలో మైనింగ్ జరుగుతుంది..? డంపింగ్‌కు ఉపయోగిస్తున్న విస్తీర్ణం ఎంత అనేది సర్వే చేసి చెప్పాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మైనింగ్ జరుగుతున్న భూములు టీజీఐఐసీ పరిధిలో ఉన్నాయి. అప్పటి ప్రభుత్వం అవసరమైనప్పుడు తిరిగి టీజీఐఐసీకి అప్పగించే ప్రాతిపదికన మైనింగ్‌కు అనుమతిచ్చింది. ఈ పరిశీలనలో ప్రిన్సిపల్ సెక్రటరీ వెంట టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ యాదయ్య, రెవెన్యూ, మైనింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



మీర్‌ఖాన్‌పేట్ పరిధి సర్వేనంబర్ 112లో కొనసాగుతున్న క్రషర్లను పరిశీలిస్తున్న సురేంద్రమోహన్ తదితరులు

మా రికార్డులు తనిఖీ చేయండి

తమ సంఘం లెక్కలు తనిఖీ చేయాలంటూ డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. రికార్డులు పరిశీలించి తీసుకున్న రుణమెంత? చెల్లించిన అప్పు ఎంత? తదితర వివరాలను చెప్పాలని బ్యాంకు మేనేజర్లను ప్రాధేయపడుతున్నారు.

- మల్కీజ్‌గూడ ఘటన నేపథ్యంలో డ్వాక్రా సంఘాల మహిళల్లో ఆందోళన
- లెక్కలు చూడాలని బ్యాంకులకు క్యూ
- వీబీకేల పాత్రపై అనుమానం



యాచారం సెర్ప్ కార్యాలయం

యాచారం: మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామంలోని వీబీకే(విలేజ్ బుక్ కీపర్) ఫోర్జరీ సంతకాలు, నకిలీ తీర్మానాలు చేసి రూ.20లక్షల వరకు నిధుల స్వాహా చేసి యాచారం ఎస్‌బీఐకి కన్నం పెట్టిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న డ్వాక్రా సంఘాల మహిళల్లో కొత్త గుబులు మొదలైంది. తమ సంఘాల్లో నిధులేమైనా పక్కదారి పట్టాయేమోనని తెలుసుకునేందుకు చౌదర్‌పల్లి, చింతుల్ల, గడ్డమల్లయ్యగూడ, గునుగల్, యాచారం, నందివనపర్తి, తమ్మలోనిగూడ, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, చింతపట్ల, తక్కళ్లపల్లి, నస్దిక్‌సింగారం, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు ఆయా గ్రామాల్లో బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. మండల పరిధిలోని 24 గ్రామాల్లో 43 గ్రామ సంఘాలు, 1,256 స్వయం సహాయక సంఘాలు, మొత్తం 13,310 మంది సభ్యులున్నారు. ఈ సంఘాలకు గాను యాచారం, నందివనపర్తి, మాల్, మీరాఖాన్‌పేట గ్రామాల్లో ఎస్‌బీఐ, మాల్‌లోని యూనియన్ బ్యాంకు, నక్కర్తమేడిపల్లి గ్రామంలోని ఇండియన్ బ్యాంకుల్లో మహిళలు రుణాలు పొందారు.

రూ.వంద కోట్ల లావాదేవీలు

గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు సెర్ప్(గ్రామీణా పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర పథకాల ద్వారా రుణాలు ఇప్పిస్తారు. 2023–24, 2024–25 రెండేళ్లకు గాను మండలంలోని అర్హత పొందిన సంఘాలకు దాదాపు రూ.80 కోట్ల రుణాలు ఇప్పించారు. 2024–25 ఏడాదికి గాను రూ.50 కోట్ల టార్గెట్‌కు గాను అర్హత కలిగిన 561 స్వయం సహాయక సంఘాలకు రూ.40 కోట్ల రుణాలు ఇప్పించారు. మరో రూ.పది కోట్ల రుణాలు ఇప్పించేందుకు ఆయా బ్యాంకుల వద్ద ప్రతిపాదనలున్నాయి. ఒక్కో సంఘానికి రూ.2 లక్షల నుంచి రూ.పది లక్షల వరకు రుణాలు ఇప్పించారు.

పర్యవేక్షణ లోపమే

మల్కీజ్‌గూడ గ్రామంలోని స్వయం సహాయక సంఘాల్లో జరిగిన రూ.లక్షలాది నిధులు స్వాహా, అవకతవకలు పూర్తిగా అధికారుల పర్యవేక్షణ లోపమేనని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామ వీబీకే నకిలీ తీర్మానాలు, ఫోర్జరీ సంతకాలు చేసి బ్యాంకుకు వెళ్లి రూ.లక్షలాది నిధులను ఇతర గ్రామాల మహిళల ఖాతాల్లో బదిలీ చేయిస్తే సెర్ప్ సీసీ, ఏపీఎం ఏంచేశారంటూ సంఘాల సభ్యులు మండి పడుతున్నారు. 24 గ్రామాల్లో 43 మంది వీబీకేలు ఉన్నారు. గ్రామ స్థాయిలోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలన్నీ వారి పర్యవేక్షణలోనే జరుగుతాయి. వీబీకేలే నిధుల స్వాహాకు పాల్పడితే ఇంకా పట్టించుకునే వారెవరని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని వీబీకేలు మహిళలకు రుణాలు ఇప్పించిన వెంటనే వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి వద్ద బలవంతంగా మళ్లీ అప్పులు తీసుకోవడం, బినామీ పేర్ల మీద రుణాలు పొంది సక్రమంగా వాయిదాలు చెల్లించకపోవడం పరిపాటిగా మారుతుంది. 15 ఏళ్ల క్రితం ఇలాంటి నిధుల స్వాహా వెలుగులోకి వచ్చింది. మళ్లీ మల్కీజ్‌గూడలో నిధుల స్వాహాతో మహిళల్లో కంటికి మీద కునుకు కరువైంది.

అధికారుల తప్పిదం



గ్రామ స్వయం సహాయక సంఘాల్లో ఎందరో అమాయకులు ఉంటారు. వారికి. తీర్మానాలపై ఎందుకు సంతకాలు చేస్తున్నారో.. రుణాలు ఎన్ని తీసుకుంటున్నామో అర్థం కాదు. మల్కీజ్‌గూడలో రూ.లక్షలాది నిధుల స్వాహాపై అధికారులు ముందే పసిగట్టకపోవడం సరైంది కాదు. బ్యాంకు మేనేజర్లు సైతం సీసీ, ఏపీఎంలకు సమాచారం లేకుండా రుణాలు మంజూరు చేయొద్దు.

– కొప్పు సుకన్య, మాజీ ఎంపీపీ

లెక్కలు పరిశీలిస్తున్నాం



మల్కీజ్‌గూడ గ్రామంలో వెలుగులోకి వచ్చిన వీబీకే నిధుల స్వాహా వ్యవహారంపై ఆయా గ్రామాల మహిళలు వారి లెక్కలు అడుగుతున్నారు. ప్రతీ గ్రూపు లెక్కలు పరిశీలిస్తున్నాం. ఇప్పటి నుంచి మహిళా గ్రూపులకు రుణాలు ఇచ్చే ముందు సెర్ప్ సీసీ, ఏపీఎంలను పిలిపిస్తాం. మహిళల ఆధార్, బ్యాంకు ఖాతాలు పరిశీలించి నిధులు బదిలీ చేస్తాం.

– జాన్సీ, ఎస్‌బీఐ మేనేజర్, యాచారం

బాధ్యులపై కఠిన చర్యలు



రుణాలు పొందిన అన్ని గ్రూపుల రికార్డులు తనిఖీ చేస్తాం. ఆయా బ్యాంకులకు వెళ్లి ఏ గ్రూపుకు ఎన్ని రుణాలు ఇచ్చారు. ఏ మహిళల పేర్ల మీద డబ్బులు బదిలీ చేశారు, రికవరీ వివరాలు తీసుకుంటా. ఏ గ్రూపులోనైన వీబీకేలు నిధుల స్వాహాకు పాల్పడితే బాధ్యులైన వారిపై కేసులు పెట్టి, విధుల నుంచి తొలగిస్తాం. మల్కీజ్‌గూడలో మూడు రోజులుగా రికార్డుల తనిఖీలు చేస్తున్నాం. స్వాహాకు గురైన నిధులు రికవరీ చేస్తాం.

– సుదర్శన్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం, యాచారం

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం


నందిని (ఫైల్)

పహాడీషరీఫ్: ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం సయ్యద్ పల్లి గ్రామానికి చెందిన సుకమెట్టి శివకుమార్, నందిని(24) దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఏడు నెలల క్రితం వీరు బతుకుదెరువు నిమిత్తం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. ఇదిలా ఉండగా నందిని ఇతరులతో తరచూ ఫోన్ మాట్లాడే విషయమై భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 18న శివకుమార్ డ్యూటీకి వెళ్లి రాత్రి 7 గంటలకు వచ్చి చూడగా, పెద్ద కుమార్తె అమ్మ ఇంట్లో లేదని ఏడుస్తూ కనిపించింది. కుమారుడు శ్రీజన్(4), కుమార్తె నయనిక(2)లతో పాటు ఆమెకు సంబంధించిన వస్తువులు, గ్యాస్ సిలిండర్‌ను తీసుకొని ఇంటి నుంచి వెళ్లినట్లు గుర్తించాడు. శివ అనే ఆటోడ్రైవర్‌తో కలిసి వెళ్లి ఉంటుందన్న అనుమానంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీరి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

యాచారం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై మూలుగుతున్న స్థితిలో యాచారం పోలీసులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఏలూరి రామాంజనేయులు బుధవారం ఉదయం మండలంలోని అయ్యవారిగూడెం అనుబంధ గ్రామం ఎనెకిందతండా సమీపంలోని ఎతైన గుట్టపైకి ఎక్కి గాయపడ్డాడు. ఆయనకు మతిస్థిమితం సరిగా లేదు. స్థానికంగా ఉండే సభావట్ వినోద్ ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ మధు అగ్నిమాపక, పోలీస్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న రామాంజనేయులును కాపాడి గుట్టపై నుంచి కిందకు తీసుకువచ్చారు. వెంటనే ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కూడా సంఘటన స్థలానికి వచ్చి గాయపడిన వ్యక్తిని పరిశీలించారు. సదరు వ్యక్తి ఎందుకు గాయపడ్డాడు, అసలు ఎక్కడికి ఎందుకు వచ్చారో ఇంకా వివరాలు తెలియరాలేదు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడినందుకు ఏసీపీ రాజు యాచారం పోలీసులను అభినందించారు.

కేంద్రం విధానాలపై రాజీలేని పోరు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంజయ్య తదితరులు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

యాచారం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి బుధవారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రైతులకు, కార్మికులకు, పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. పేదలకు అన్యాయం చేస్తూ పారిశ్రామికవేత్తలకు వత్తాసు పలుకుతోందన్నారు. ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, మల్లయ్య, చెన్నయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మైసిగండి జాతర

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు భక్త జన సందోహంతో కొనసాగిన ఉత్సవాలను ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరించడంతో పాటు, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, జవహర్, కృష్ణ, తహసీల్దార్ జ్యోతి ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


కూరగాయల అలంకరణలో అమ్మవారు


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు


కడ్తాల్: లగచర్లకు వెళ్తున్న గిరిజన నేతలు


మంచాల: పోలీసుల అదుపులో గిరిజన సంఘం నాయకులు

నిర్బంధాలతో పోరును ఆపలేరు

- గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్

షాద్‌నగర్: అక్రమ కేసులు, నిర్బంధాలతో ప్రభుత్వం తమ పోరాటాన్ని ఆపలేరని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్ నాయక్ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో చలో లగచర్లకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం పోలీసులు ఆయనతో పాటు పలువురు గిరిజన సంఘం నాయకులను బైపాస్‌లోని రసోయ్ హోటల్ వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంబల్ నాయక్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు గిరిజనులు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారన్నారు. గిరిజనుల భూములను బలవంతంగా లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఇటీవల లగచర్లలో జరిగిన ఘటనపై ఢిల్లీలోని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో పాటుగా, కేంద్ర వర్గాలకు కలిసినట్లు తెలిపారు. లగచర్లలో గిరిజనులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో లక్ష్మణ్‌నాయక్, చందునాయక్, లిబియానాయక్, ఏకనాథ్‌నాయక్, రాజునాయక్, శ్రీనివాస్, జగన్, మోహన్, బాబు, రాజేందర్, అంబదాస్, భోజ్యా నాయక్ తదితరులు ఉన్నారు.

నేతల ముందస్తు అరెస్టు

మంచాల: లగచర్ల ఘటనపై గిరిజన, ప్రజాసంఘాల పిలుపుతో బుధవారం పోలీసులు అప్రమత్తమయ్యాయి. మండలంలోని గిరిజన సంఘాల నాయకులు కొర్ర శ్రీనివాస్‌నాయక్, వెంకటేష్, రవీందర్‌లను తెల్లవారుజామునే ముందస్తు అరెస్టులు చేసి మంచాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల పేరుతో భూములను లాక్కోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే కుట్రలు మానుకోవాలన్నారు. సాగుకు యోగ్యం కాని భూములను తీసుకోవాలన్నారు.

బొంరాస్‌పేటలో నేతల అరెస్టు


ఆమనగల్లు: బొంరాస్‌పేటలో అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆమనగల్లు/కడ్తాల్: ఇటీవల లగచర్లలో జరిగిన వివాదంలో అమాయక గిరిజనులను పోలీసులు వేధిస్తున్నారని ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ గిరిజన నేతలు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం లగచర్లకు తరలివెళ్లారు. ఈ క్రమంలో కడ్తాల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మాడ్గుల మాజీ ఎంపీపీ జైపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీలు నాగులునాయక్, లచ్చిరాంనాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరాం నాయక్, లోకేశ్‌నాయక్, హరిచంద్‌నాయక్ తదితరులను బొంరాస్‌పేట మండల కేంద్రంలో పోలీసులు అడ్డుకుని ఠాణాకు తరలించారు.

నా చావుకు ఎవరూ కారణం కాదు

- కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా..
- సూసైడ్ నోట్ రాసి ఉరేసుకున్న వ్యక్తి
- ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన కుళ్లినస్థితిలో మృతదేహం గుర్తింపు
- నల్లగొండ జిల్లా వాసిగా నిర్ధారణ

ఇబ్రహీంపట్నం రూరల్: 'నా చావుకు ఎవరూ కారణం కాదు.. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా' అని సూసైడ్ లేఖ రాసిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకొని కుళ్లిన స్థితిలో ఓ మృతదేహాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలరాజు వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏడెనిమిది రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ప్యాంట్ జేబుల్లో వెతకగా బీడీలు, అగ్గిపెట్టెతో పాటు ఒక కవర్‌లో లేఖను గుర్తించారు. తన చావుకు తీవ్రమైన కడుపునొప్పి కారణమని అందులో రాసి ఉంది. పక్కనే కుమార్తె ఉమ సెల్‌ఫోన్ నంబరు కూడా ఉండటంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. వివరాలు ఆరా తీయగా.. మృతుడు నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన పోల్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి(56)గా గుర్తించారు. నల్లమల్ల అపార్ట్‌మెంట్ ప్రముఖ్ టౌన్‌షిప్‌లో తన బిడ్డ వద్ద ఉండేవాడని తెలుసుకున్నారు. బోర్‌వెల్‌పై పని చేస్తూ పది రోజులకోసారి ఇంటికి వచ్చేవాడని తెలిపారు. వారం క్రితమే ఇంటి నుంచి వెళ్లినట్లు చెప్పారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మల్లేశ్ (ఫైల్)

కేశంపేట: రోడ్డు ప్రమాదం ముక్కుపచ్చలారని ఓ చిన్నారికి తండ్రిని దూరం చేసింది. రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఉదంతం మండల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన మల్లేశ్(23) లేమామిడి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స కోసం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అటునుంచి నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు వారం రోజుల పాప ఉంది. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు నరేశ్ ప్రజాపతి


వినతిపత్రం అందజేస్తున్న నరేశ్ తదితరులు

తుర్కయంజాల్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోలు నరేశ్ ప్రజాపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందని, 55 శాతంకు పైగా ఉన్నప్పటికీ, 18 శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నారన్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో కూడా జనాభాకు తగిన రీతిలో రిజర్వేషన్లను కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లుగా 42 శాతం రిజర్వేషన్‌లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, నరసింహానాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.పది లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న శివ శక్తి పరిశ్రమ యజమాని సునిల్

నందిగామ: నందిగామ పారిశ్రామిక వాడలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ పునఃనిర్మాణానికి శివశక్తి స్పాంజ్ ఐరన్ పరిశ్రమ యాజమాన్యం భారీ విరాళం ప్రకటించింది. ఈ మేరకు బుధవారం పరిశ్రమ యజమానికి సునిల్ గురుస్వామి గిరిషన్ నాయర్‌కు రూ.10లక్షల నగదు అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి గిరిషన్ నాయర్ మాట్లాడుతూ.. ఆలయ పునఃనిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. అనంతరం గురుస్వాములు సునిల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సుదర్శన్ గౌడ్, హరిజీవన్, నర్సింహ యాదవ్, బాల్‌రెడ్డి, లక్ష్మయ్య యాదవ్, రాంరెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, నవాజ్‌రెడ్డి, చిందం నర్సింహ, కుమార్ గౌడ్, కొమ్ము కృష్ణ, జంగ నర్సింహయాదవ్, జంగయ్య, చించేటి కృష్ణ, కృష్ణ యాదవ్, రమేష్ చారి, నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: ఫుట్‌పాత్ ఆక్రమణలను సహించేది లేదని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు టోలిచౌకీ టూంబ్స్ రోడ్డు, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లను కబ్జా చేసి వాటిపై వెలిసిన డబ్బాలను తొలగించి వాటిని గోషామహల్‌కు తరలించారు.

స్టాక్ లేదు!

స్టోర్స్‌లో విద్యుత్ పరికరాలు లేక ఇబ్బందులు

- సీటీపీటీలు, ఎల్టీహెచ్ఎల్‌పీ కేబుల్స్, ఫిన్స్, డిస్కుల కొరత
- మెటల్ పార్ట్స్, సింగిల్ కోర్ కేబుల్స్ సైతం లేవట..
- డీడీలు చెల్లించి నాలుగైదు మాసాలైనా చేతికందని విద్యుత్ పరికరాలు
- ఆందోళనలో గృహ, వాణిజ్య వినియోగదారులు

సాక్షి, సిటీబ్యూరో: రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్‌కు చెందిన సత్యనారాయణ..ఈ ఏడాది జులై 26న 11కేవీ సీటీపీటీ సెట్ సహా 11 కేవీ హెచ్‌టీ టీవీఎం 20/5ఏ కోసం రూ.6.38 లక్షలు డీడీ చెల్లించారు. ఇప్పటికీ విద్యుత్ పరికరాలు సరఫరా కాలేదు. కాంట్రాక్టర్ రంగారెడ్డి స్టోర్స్‌కు చేరుకుని మెటీరియల్ ఇవ్వాల్సిందిగా కోరగా, స్టాక్ లేదని తిప్పి పంపారు.

- సైనిక్‌పురికి చెందిన ఎస్.నాగలక్ష్మి ఎల్‌టీ ఎక్స్‌ఎల్‌పీఈ కేబుల్ 1 కోర్ 120 స్క్వేర్ ఎంఎం సహా మరో పది పరికరాలకు ఆగస్టు 10న డీడీ కట్టారు. మూడు నెలలైనా ఇప్పటికీ కేబుల్ ఇవ్వలేదు. ఇక సైనిక్‌పురి సెక్షన్‌కు చెందిన వర్ధన్ ప్రాజెక్ట్స్ సాధన విహార్ విద్యుత్ మెటీరియల్స్ కోసం జులై 1న డీడీ కట్టారు. ఇప్పటికీ మెటీరియల్ అందలేదు. విద్యుత్ కాంట్రాక్టర్ స్వయంగా స్టోర్‌కు చేరుకుని ఆరా తీస్తే..వారం కిత్రమే మెటీరియల్ వచ్చిందని, ఆ వెంటనే స్టాక్ ఖాళీ అయిందని ఇంజనీర్లు సెలవిచ్చారు. మళ్లీ ఎప్పుడు వస్తుందని ప్రశ్నిస్తే? కనీస సమాధానం లేదు.
- ఇది కేవలం సత్యనారాయణ, నాగలక్ష్మి, వర్ధన్ ప్రాజెక్ట్స్ వినియోగదారులకు ఎదురైన చేదు అనుభవమే కాదు..విద్యుత్ పరికరాలు కోసం రూ.లక్షల చొప్పున డీడీలు చెల్లించిన అనేక మంది గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బంది.

డీడీలు కట్టి..నాలుగైదు మాసాలైనా..

కొత్త పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాల్లో విద్యుత్ పనులను ప్రైవేటు కాంట్రాక్టర్లే చేస్తున్నారు. నిర్మాణ సమయంలోనే సదరు వినియోగదారుడు డిస్కంకు దరఖాస్తు చేసుకుంటారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇందుకు అవసరమైన విద్యుత్ పోల్స్, కండక్టర్, మెటల్ పార్ట్స్, ఇన్సులేటర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్స్, సీటీపీటీలు, ఏబీ స్విచ్‌లు, పీటీఆర్‌లు, ఆర్ఎంయూలు, ఆయిల్ డ్రమ్స్, క్రాస్ ఆర్మ్‌లు, ఫ్యూజ్ సెట్స్, మీటర్లు, ప్యానల్ బోర్డులకు అంచనాలు రూపొందించి ఇవ్వగా, సదరు వినియోగదారులు డీడీ రూపంలో డిస్కంకు ఆ మొత్తాన్ని చెల్లిస్తుంటారు. నిజానికి ప్రైవేటు మార్కెట్లో ఆయా విద్యుత్ పరికరాలన్నీ దొరుకుతున్నప్పటికీ..సరఫరాలో నాణ్యత, షార్ట్ సర్క్యూట్‌ల నియంత్రణ పేరుతో తామే వాటిని స్వయంగా సరఫరా చేయనున్నట్లు డిస్కం ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా పర్చేజింగ్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి, ఆ మేరకు ఆయా తయారీ సంస్థల నుంచి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం మొత్తం 121 రకాల విద్యుత్ పరికరాలను ఆయా తయారీ సంస్థల నుంచి దిగుమతి చేసుకుని, హైదరాబాద్, రంగారెడ్డి స్టోర్స్‌లో నిల్వ చేస్తుంది. అటు నుంచి సర్కిళ్లు/డివిజన్ల వారీగా దరఖాస్తు దారులకు(సీరియల్ నంబర్ల ఆధారంగా) ఆయా విద్యుత్ పరికరాలను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ నెలలు గడిచినా..స్టోర్స్‌కు ఆయా పరికరాలు రావడం లేదు.



లంచం ఇస్తే ఓకే..

కాగా విద్యుత్ పరికరాల సరఫరాకు డిమాండ్‌కు మధ్య భారీ వ్యత్యాసం ఉండటాన్ని ఇంజనీర్లు క్యాష్ చేసుకుంటున్నారు. రూ.5000 ఇస్తే చాలు దరఖాస్తు సీనియార్టీతో సంబంధం లేకుండా కోరిన పరికరాలను అప్పగిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు నిర్ధేశించిన తూకానికి తక్కువగా కండక్టర్ అప్పగిస్తున్నారు. ఒక్కో డ్రమ్ నుంచి రెండు నుంచి ఐదు కేజీల వరకు తగ్గిస్తున్నట్లు తెలిసింది. ఇన్సులేటర్లు, పిన్స్ ఇవ్వకుండా, గుట్టుగా వాటిని ప్రైవేటు దుకాణాలకు తరలిస్తున్నట్లు తెలిసింది.

కాంట్రాక్టర్లపై పెరుగుతున్న ఒత్తిడి

డీడీ కట్టిన వారం పది రోజుల్లోనే మెటీరియల్ అందజేయాల్సి ఉంది. కానీ కొంత మంది ఇంజనీర్లు ఉద్దేశ పూర్వకంగానే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఇండెంట్లు పంపించి, పరికరాలను దిగుమతి చేసుకోవడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వినియోగదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విధిలేని పరిస్థితుల్లో కాంట్రాక్టర్లే ఆయా పరికరాలను ప్రైవేటుగా కొనుగోలు చేసి, పనులు చేయాల్సి వస్తోంది.
–ప్రదీప్‌రెడ్డి, సీనియర్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్

చెట్లకు జీవం పోశారు



పహాడీషరీఫ్: మనసుంటే మార్గముంటుందని అధికారులు మరోసారి నిరూపించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన వృక్షాలను హెచ్ఎండీఏ అధికారులు మరో ప్రాంతంలో నాటి జీవం పోశారు. మామిడిపల్లిలోని వివేకానంద కూడలి నుంచి శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు గతేడాది 2.5 కిలోమీటర్ల మేర 150 ఫీట్లుగా పాత రోడ్డును విస్తరించారు. ఈ క్రమంలో పాత రోడ్డుపై ఉన్న చెట్లను ఎడాపెడా నరికేయకుండా పచ్చదనాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో కొమ్మలు మాత్రమే నరికి, మానును మాత్రం కూకటివేళ్లతో పెకిలించి సమీపంలోని పొలాలు, ఇతర రహదారులపై నాటారు. ఏడాది అనంతరం ప్రస్తుతం ఆ మానులు జీవం పోసుకొని కొమ్మలతో చిగురించాయి.